సాక్షి చిత్తూరు

శుక్రవారం । 23 । జూన్ । 2023



నేటి నుంచి జగనన్న సురక్ష

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు.

- 8లో



130 గ్రామాల్లో రీ సర్వే పూర్తి

జిల్లాలో మొదటి విడత 130 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	26
తిరుపతి	36	26
తిరుమల	31	22
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

అత్యవసర విభాగంలో మెరుగైన సేవలు

చిత్తూరు రూరల్: అత్యవసర విభాగంలో మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, సివిల్ సర్జన్‌ను నియమించనున్నట్లు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఆస్పత్రి నిర్వహణలో పలు మార్పులు చేయాలను కుంటున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అత్యవసర విభాగంతో డాక్టర్ల కొరత లేకుండా చూస్తామని తెలిపారు. అక్కడ అందే వైద్య సేవల పనితీరుపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచుతామని చెప్పారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించినట్లు ఫిర్యాదులు అందితే తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

జగనన్న ఇళ్లకు ఉచిత సర్వీసు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకుంటే ఉచితంగా సర్వీసు ఇస్తామని ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. జగనన్న కాలనీల్లోనే కాకుండ సొంత స్థలం కలిగి ఇంటి నిర్మాణం కోసం హౌసింగ్ లోన్ పొందిన వారు ఉచిత సర్వీసుకు అర్హులన్నారు. ఇంటి నిర్మాణం పూర్తయితే ఉచితంగా విద్యుత్ మీటర్, ఎర్త్‌పైప్, ఎంసీబీ బోర్డు, సర్వీసు వైర్ ఇస్తామని తెలిపారు. అవసరమైతే లైన్ లాగి కరెంటు పోల్ కూడ ఏర్పాటు చేస్తామన్నారు. అర్హులైన లబ్ధిదారులు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్, హౌసింగ్‌లోన్ మంజూరు పత్రాలను జతచేసి సంబంధిత ఏఈ కార్యాలయంలో అందించాలని వివరించారు.

2 సబ్‌స్టేషన్లు మంజూరు

పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల మండలానికి 2 సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆ మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లె, గంటావారిపల్లెలో వీటిని రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. రైతులకు మెరుగైన సరఫరా కోసం సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

26 నుంచి కుష్టు వ్యాధి సర్వే



మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

చిత్తూరు రూరల్: ఈనెల 26 నుంచి జులై 16వ తేదీ వరకు జరిగే జాతీయ కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేను బాధ్యతతో నిర్వర్తించాలని కుష్టు, క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. గురువారం చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సమావేశ మందిరంలో గురువారం కుష్టు వ్యాధి సర్వేపై ఆశావర్కర్లకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో సర్వేల విషయంలో ఆశావర్కర్లు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. చాలా ప్రాంతాల్లో ఒక్క కేసును కూడా గుర్తించ లేదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగి రంగు మచ్చలు, కండరాలలో బలహీనత, నరాల్లో తిమ్మిరి, కళ్లు పూర్తిగా ముసుకోపోవడం వంటి లక్షణాలను గుర్తించాలన్నారు. ఆర్‌ఎంపీలు చేసే వైద్యం వల్ల చాలా మంది అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. అధికారులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న జిల్లా అర్చకుల సంఘ సమావేశం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం, పొన్నియమ్మ గుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 26న జిల్లా అర్చకుల సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలోని అర్చకులంతా ఈ సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

వైఎస్సార్ పశు బీమా..
రైతులకు ధీమా



పూతలపట్టులో గురువారం బీమాపై అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్

పశువులు, జీవాలు ప్రమాదవశాత్తు మరణిస్తే పెంపకందారులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద రైతు చెల్లించాల్సిన బీమా ప్రీమియం వాటాలో కూడా రాయితీని కల్పించింది. ప్రతి కుటుంబానికి 5 పశువులు, 50 గొర్రెలు, 50 మేకలు, 50 పందుల మేరకు బీమా సౌకర్యం వర్తిస్తుంది. ఏడాది కాల వ్యవధి నుంచి మూడేళ్ల వ్యవధి వరకు బీమా చేసుకునే వెసులుబాటును కల్పించింది. పశుసంవర్థక శాఖాధికారులు దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- పశువులు, జీవాల పెంపకందారులకు ఊరట
- జిల్లాలో 5 లక్షల పశువులు, 7 లక్షల జీవాలకు బీమా వెసులుబాటు
- ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వ రాయితీ
- హర్షం వ్యక్తం చేస్తున్న పాడి రైతులు

చిత్తూరు అగ్రికల్చర్: పాడి రైతులు, జీవాల పెంపకందారులకు పశు బీమా పథకంతో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారులకు ఆర్థిక ఊరట కలిగిస్తూ నూతనంగా వైఎస్సార్ పశుబీమా పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో రైతులు వ్యవసాయంతోపాటు ప్రధానంగా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులకు పశుపోషణే ప్రధాన జీవనాధారం. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. అటువంటి పశువులు, జీవాలు ప్రమాదవశాత్తు మరణిస్తే పశుపోషకులు ఆర్థికంగా నిలదొక్కులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనలు ఇలా

- ఉత్పాదక దశలో ఉన్న ఒకసారి ఈనిన 2–10 సంవత్సరాల ఆవులు, 3–12 సంవత్సరాల గేదెలకు బీమా వర్తిస్తుంది.
- ఒకటిన్నర సంవత్సరం పైబడిన మేలుజాతి (సంకర జాతి, దేశీయ)ఎద్దులు, దున్నలకు , 2 సంవత్సరాలు పైబడిన సాధారణ ఎద్దులు, దున్నలకు బీమా వర్తిస్తుంది.
- 6 నెలలు వయస్సు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు బీమా వర్తిస్తుంది.
- దంత అమరిక ద్వారా వయస్సు నిర్ధారిస్తారు.

జిల్లాలో పశుసంపద

పాడి ఆవులు	గేదెలు
5,40,397	4,910
గొర్రెలు	**మేకలు**
5,01,893	2,08,018

ఇలాంటి పరిస్థితులను అధికమించే విధంగా బీమా పథకాన్ని ఈ ఏడాది ప్రారంభించింది.

భారీగా రాయితీ

ప్రీమియం వాటాలో కూడా రాయితీని కల్పించింది. ఎస్సీ, ఎస్టీ, రైతులతో పాటు బీపీఎల్ (బిలో పావర్టీ లెవల్) లోపు రైతులు ప్రీమియం 20 శాతం చెల్లిస్తే, మిగిలిన 80 శాతం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. ఇతర లబ్ధిదారులు ప్రీమియంలో 50 శాతం చెల్లిస్తే చాలు.

బీమా చెల్లింపు ఇలా

- మేలు జాతి (సంకర జాతి, దేశీయ) పశువుకు రూ. 30 వేలు
- నాటు పశువుకు రూ.15 వేలు
- ఒకటిన్నర సంవత్సరాలు వయస్సు పైబడిన మేలుజాతి (సంకరజాతి, దేశీయ) ఎద్దులు, దున్నలకు రూ.30 వేలు
- 2 సంవత్సరాలు వయస్సు పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు రూ. 15 వేలు
- 6 నెలలు వయస్సు పైబడిన గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేలు

వరదలు, తుపాను, పిడుగు పాటు, పాముకాటు, అడవి జంతువు దాడి, అగ్నిప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదం, అనారోగ్యంతో పశువులు, జీవాలు చనిపోతే బీమా వర్తిస్తుంది.

ఇవి తప్పనిసరి

- పశువులు, జీవాలకు బీమా చేయించుకునేందుకు రైతు భరోసా కేంద్రంలోని పశువైద్య సహాయకులను ఆశ్రయించాలి.
- బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో పాటు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు బియ్యం కార్డు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు కుల ధ్రువీకరణ పత్రం తీసుకెళ్లాలి.
- పశువులు, జీవాలు మరణించిన వెంటనే దగ్గరలోని రైతు భరోసా కేంద్రంలోని పశువైద్య సహాయకునికి తెలియజేయాలి లేదా 1962కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.
- బీమా చేయించిన వాటికి తప్పని సరిగా చెవి పోగు వేయించాలి.

సద్వినియోగం చేసుకోవాలి

పశు బీమా సౌకర్యం పాడి రైతులకు ఎంతో మేలు. పాడిరైతులు, జీవాల పోషకులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రీమియం చెల్లింపులో కూడా ప్రభుత్వం రాయితీని కల్పిస్తోంది. ప్రతి రైతు భరోసా కేంద్రంలో పశువైద్య సహాయకుడిని అందుబాటులో ఉంచాం. బీమాపై రైతులకు గ్రామాల వారీగా అవగాహన కల్పిస్తున్నాం.

– ప్రభాకర్, పశుసంవర్థక శాఖ జేడీ

అది నారాహీ యాత్ర

- బాబును సీఎం చేసేందుకే పవన్ యాత్ర
- నా ఆరోగ్య పరిస్థితిపై సోషల్ మీడియాలో విష ప్రచారం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : చంద్రబాబును సీఎం చేసేందుకు పవన్ యాత్ర చేస్తున్నారని, అది వారాహీ యాత్ర కాదని నారాహీ యాత్ర అని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా విమర్శించారు. అనారోగ్యం కారణంగా కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్న ఆమె గురువారం నగరి పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏదో ఒకసమయంలో అనారోగ్యం పాలవుతారని చికిత్స పొంది సాధారణ స్థితికి రావడం సహజమన్నారు. తాను కాస్త అనారోగ్యం పాలైతే ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో పనికట్టుకుని విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. తన విషయంలో ఇంతగా స్పందిస్తున్నారంటే జగనన్న అడుగుజాడల్లో తాను ప్రజల్లోకి చొచ్చుకుపోతున్న తీరు వారిని ఎంతగా భయపెడుతోందో అర్థమవుతోందన్నారు. ప్రజల ఆశీస్సులు తనకు రక్షగా ఎప్పుడూ ఉంటాయని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా సేవలో మళ్లీ పాల్గొంటానని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇటీవల చేస్తున్న వ్యాఖ్యలపై ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు. సీఎం జగన్ మోహన్ రెడ్డిలా తాము చేసిన మంచి చెప్పుకుని ఓట్లు అడుక్కునే ధైర్యం చంద్రబాబుకు లేదన్నారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు పాలనలో ప్రజలకు మేలు చేసిన ఒక్క పథకం గురించి చెప్పుకోలేని పరిస్థితి ఉందని ఆరోపించారు. పార్టీ పెట్టి 9 ఏళ్లు అయినా 175 స్థానాల్లో పోటీ చేయలేని వ్యక్తి పవన్‌కల్యాణ్ అన్నారు. చంద్రబాబును సీఎం చేసేందుకు పవన్ యాత్ర చేస్తున్నారని, అందుకే వారాహీ యాత్ర.. నారాహీ యాత్రను ప్రజలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. చంద్రబాబును నమ్మొద్దని అన్న చిరంజీవి చెప్పిన మాటలు పవన్ జ్ఞాపకానికి తెచ్చుకోవాలన్నారు. జగనన్నలా ప్రజలకు మంచిచేసే సీఎం మరొకరు లేరని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిందన్నారు. ప్రజలంతా జగనన్న వెంటే ఉన్నారని తెలిపారు. సీఎం జగనన్నకు జనమే బలమని తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న పథకాలు ఇలాగే కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించి జగనన్ననే సీఎంగా చేసుకోవాలని ప్రజలు ఎదు రు చూస్తున్నారని రోజా తెలిపారు.

ఉన్నతి రుణాలతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: ఉన్నతి రుణాలతో ఎస్సీ, ఎస్టీలు ఆర్థికాభివృద్ధి సాధించాలని, ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో మొత్తం రూ.15 కోట్ల మేరకు రుణాలను అందించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ భవనంలో వెలుగు ఏపీఎంలు, సీసీలకు ఉన్నతి పథకం రుణాలపై రెండురోజుల పాటు లబ్ధిదారుల ఎంపిక, రుణాల ప్రతిపాదనలు, రుణాల పంపిణీ, రికవరీలు, బీమా పథకాలు తదితరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం ముగింపు సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఉన్నతి పథకం ద్వారా వడ్డీలేని రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రాణాలు తీసిన నిర్లక్ష్యపు గొయ్యి!

పుట్టిన ఇద్దరు ఆడబిడ్డలకు సరిగా మాటలు రావు. అయినా ఎప్పుడూ కుంగిపోలేదు.. దేవుడిచ్చిన బిడ్డ లేకదా అని సర్దుకున్నాం. ఇప్పుడు లేకలేక పుట్టిన మగబిడ్డనూ ఆ దేవుడు తీసుకెళ్లాడు.. ఎందుకింత శిక్ష వేశావు నాయనా?.. అంటూ ఆ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. ఈ ఘటన యాదమరి మండలం, తెల్లరాళ్లపల్లెలో గురువారం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

- నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృతి
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు



మృతి చెందిన కుమారుడిని ఒడిలోకి తీసుకొని రోదిస్తున్న తల్లి



ఇద్దరు పిల్లల మృతికి కారణమైన గొయ్యి

యాదమరి: యాదమరి మండలం, తెల్లరాళ్లపల్లె గ్రామానికి చెందిన సతీష్, హేమలత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు సక్రమంగా మాటలు రావు. మరో బిడ్డ ఆరోగ్యంగా పుట్టాలని వేలూరు సీఎంసీలో చికిత్సలు చేసుకున్నారు. వారి ఆకాంక్ష నెరవేరింది. మగబిడ్డ ఆరోగ్యంగా జన్మించాడు. తెల్లరాళ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో పెద్ద పాప అశ్విని(11) ఆరో తరగతి, రెండో పాప పూర్ణశ్రీ(10) ఐదో తరగతి చదువుతుండగా.. కుమారుడు మదన్(2) తల్లివద్దే ఉంటున్నాడు. గురువారం కుమార్తెలిద్దరూ పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభమవడంతో అక్కడే ఉండిపోయారు. ఇంతలో తమ్ముడు మదన్‌ను కూడా తోటి స్నేహితులు అక్కడికి తీసుకొచ్చారు. వర్షం తగ్గాక పూర్ణశ్రీ(9), మదన్(2) ఇద్దరూ చిరుతిళ్లకని పాఠశాల ఆవరణ నుంచి దుకాణానికి బయలుదేరారు. వెళ్లే సమయంలో దారిపక్కనే ఉన్న గొయ్యిలో ప్రమాదవశాత్తు కాలుజారిపడిపోయారు. అప్పటికే నీటితో నిండి ఉన్న గుంతలో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణం

పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్ కడతామని కాంట్రాక్టర్ ఏడాది క్రితం ఏడు అడుగుల గొయ్యి తీశాడు. కానీ పనులు చేయలేదు. ప్రస్తుతం వర్షపునీటికి గొయ్యి నిండిపోయింది. గొయ్యి పక్కనే ఉన్న దారిలో దుకాణానికి వెళ్లిన పిల్లలు కాలుజారి అందులో పడిపోయారు. నిర్లక్ష్యంగా గొయ్యి తీసిన కాంట్రాక్టర్‌పై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సుమన్, ప్రజాప్రతినిధులు

విషయం తెలుసుకున్న యాదమరి ఎస్‌ఐ సుమాన్, ప్రజాప్రతినిధులు గొందివాళ్లపూరు బాబు, భజలింగం, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి, తెల్లరాళ్లపల్లెలో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆపై మృతుల తల్లిదండ్రులను ఓదార్చారు. అలాగే ఎంపీడీఓ శివరాజ్, ఎంఈఓ రుక్మిణీ జరిగిన సంఘటనపై ఆరా తీశారు.

నేటి నుంచి కుప్పంలో మంత్రి పెద్దిరెడ్డి పల్లెబాట



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, రెస్కో చైర్మన్

కుప్పం: నియోజకవర్గంలో గురువారం నుంచి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాలుగు రోజుల పల్లెబాట కార్యక్రమంలో పాల్గొననున్నారు. గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో మంత్రి పర్యటించనున్న గ్రామాల్లో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభా ప్రాంగణ వేదికలు, సమావేశాలకు తరలివచ్చే ప్రజలకు, మహిళలకు కనీస సదుపాయాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గుడుపల్లె మండలంలో ప్రతి పంచాయతీ కేంద్రంలో జరిగే సభలో మంత్రి ప్రసంగించనుండడంతో భారీ ఏర్పాట్లు చేపట్టారు.

వైఎస్సార్ సీపీలో నూతనోత్సవం

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం నియోజకవర్గంలో 30 ఏళ్లుగా తరుచూ పర్యటిస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకున్నారు. ఈసారి నాలుగు రోజులు రెండు మండలాల్లో పల్లెబాట చేపడుతున్నారు. 23, 24 తేదీల్లో గుడుపల్లె మండలంలో, 26, 27 తేదీల్లో రామకుప్పం మండలంలో పర్యటించనున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ సారి నాలుగు రోజులు కుప్పం నియోజకవర్గ పర్యటించనుండడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సవం వెల్లివిరుస్తోంది. మంత్రిని తమ గ్రామాలకు స్వాగతం పలికేందుకు భారీ హోర్డింగ్‌లను ఏర్పాట్లు చేశారు. గ్రామాలను వైఎస్సార్ సీపీ స్వాగత తోరణాలు, బ్యానర్లతో ముస్తాబు చేశారు.

ఎక్సెస్ కండెక్టర్లు 31మంది జిల్లాకు బదిలీ

చిత్తూరు రూరల్: ఎక్సెస్ పేరుతో ఇతర జిల్లాలకు వెళ్లిన కండక్టర్లు ఏపీపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి చొరవతో జిల్లాకు బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి 2017లో ఎక్సెస్(ఉండాల్సిన దాని కంటే అదనం) పేరుతో 42 మంది ఆర్టీసీ కండక్టర్లపై తూర్పు, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలకు బదిలీ వేటు వేశారు. కుటుంబ సమస్యలు బరువెక్కడం, అనారోగ్య సమస్యలు వేధించడంతో అవస్థలు పడుతూ వస్తున్నారు. ఆ కండక్టర్లు ఇటీవల ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. స్పందించిన ఆయన వారి సమస్యను ఆర్టీసీ ఎండీ తిరుమల రావు దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాలో 31 మంది కండక్టర్లు తక్కువ ఉన్నారని, ఆ స్థానంలోకి చిత్తూరు నుంచి ఎక్సెస్ పేరుతో వివిధ జిల్లాకు వెళ్లిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. ఈమేరకు ఎండీ ఆ కండక్టర్లను చిత్తూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలో కంటైనర్ డిపో

- సులభతరంగా జిల్లా ఉత్పత్తుల ఎగుమతి
- ఉపాధి అవకాశాలు మెరుగు
- సరుకు రవాణా ఖర్చులు తగ్గుతాయి
- జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్



విదేశీ ప్రతినిధులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్


సాక్షి, చిత్తూరు: జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తుల కోసం కంటైనర్ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సగిలి షణ్మోహన్ వెల్లడించారు. గురువారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో కంటైనర్ డిపో ఏర్పాటుపై డీపీ వరల్డ్ సంస్థ ప్రతినిధులు, మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, గ్రానైట్ కంపెనీ యజమానులు, సంబంధింత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఉత్పత్తులను విదేశాలకు పంపడంలో భాగంగా సరుకు రవాణా పంపిణీ విధానానికి ఎక్కువ ఖర్చు అవుతోందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇన్లాండ్ కంటైనర్ డిపో ఏర్పాటు ద్వారా మ్యాంగో పల్ప్, గ్రానైట్‌ను చెన్నై నుంచి కాకుండా నేరుగా విదేశాలకు పంపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. జిల్లా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దుగా ఉండడం, జాతీయ రహదారులు అభివృద్ధి చెంది ఉండడంతో కంటైనర్ ఏర్పాటుతో మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు.

72 దేశాల్లో వ్యాపారాలు

డీపీ వరల్డ్ సంస్థ చెన్నై ప్రతినిధులు రాజేశ్వరి, శివ మ్ తమ సంస్థ కార్యక్రమాల వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 72 దేశాల్లో చేస్తున్న వ్యాపారాలు, ఇండియాలో 5 పోర్టుల్లో చేస్తున్న ఎగుమతులు వివరించారు. ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, గ్రానైట్ కంపెనీల యజమానులు తమ ఎగుమతులను వివరించారు. ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, ఉద్యాన వ నశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, ప్రాసెసింగ్ యూ నిట్ యజమానులు గోవర్ధన్ బాబీ, బాబు రెడ్డి, శివకుమార్, షమీర్, ట్రాసిన్ గ్రూప్ ప్రతినిధులు సాయి కృష్ణా, రాజశేఖర్, గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ యజమానులు బఫోని రెఫ్లాక్, వినోద్, సూర్య నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

25న పుత్తూరు పిల'గోడు' పుస్తకావిష్కరణ



పుత్తూరు రూరల్: పుత్తూరుకు చెందిన ప్రముఖ కథా రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు రచించిన పుత్తూరు పిల'గోడు' హాస్య కథల పుస్తకాన్ని ఈనెల 25న హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర రవాణా, ఆర్అండ్‌బీ శాఖ సెక్రటరీ కేఎస్.శ్రీనివాసరాజు ఆవిష్కరించనున్నారు. పుత్తూరు శల్య వైద్య కుటుంబానికి చెందిన రచయిత యాభై ఏళ్ల కిందట జరిగిన సరదా సంఘటనలను కథలుగా మలిచి పుస్తక రూపంలో సంకలనం చేశారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల కలయికతో మాట్లాడే చిత్తూరు జిల్లా యాస మాటలతో కథలు కడుపుబ్బా నవ్విస్తాయి. హైదరాబాద్‌కు చెందిన 'అచ్చంగా తెలుగు ప్రచురణ'ల ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్, ప్రముఖ రచయితలు పాణ్యం దత్తశర్మ, బత్తుల ప్రసాదరావు, సినీ నటులు జెన్నీ పాల్గొననున్నారు.

నేడు జగనన్న సురక్ష ప్రారంభం

- ప్రభుత్వ భవనాల పనులను వేగవంతం చేయండి
- నాడు నేడు పనుల్లో అలసత్వం వీడండి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభం కానుందని, అధికారులు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారుతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు నియోజకవర్గ నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం వలంటీర్లకు ప్రభుత్వం అమలు చేసిన యాప్ పట్ల అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

భవనాల నిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రభుత్వం ప్రాధాన్యతగా అమలు చేస్తున్న భవనాల పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, ఏఎంసీ, బీఎంసీల నిర్మాణ పనుల్లో పురోగతి చూపాలన్నారు.

నాడు–నేడు పనుల్లో అలసత్వం వద్దు

జిల్లా వ్యాప్తంగా నాడు–నేడు పనుల్లో అలసత్వం వీడి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో పలు చోట్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, పీఆర్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు చంద్ర శేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, శంకర్‌బాబు డీఆర్‌డీఏ, డ్వామా, మెప్మా పీడీలు తులసి, గంగ భవాని, రాధమ్మ, సీపీవో, డీపీవో ఉమా దేవి, లక్ష్మి ,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, డీఎల్‌డీఓ రవికుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

130 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా భూ రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని, 130 గ్రామాల్లో మొదటి విడత రీసర్వే పూర్తి చేసినట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం సీసీఎల్ఏ కార్యదర్శులు సిద్ధార్థ జైన్, ప్రభాకరరెడ్డి విజయవాడ నుంచి జాయింట్ కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణయించిన గడువు లోపు రీసర్వే లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి లోపాలు లేకుండా నిబంధనల ప్రకారం రీసర్వే నిర్వహించి యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి విడత రీ సర్వే 130 గ్రామాల్లో ముగిసిందన్నారు. అందులో 27 గ్రామాల్లో సర్వే రాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేశామని చెప్పారు. 3,082 మందికి 3,536 ఎకరాల భూమిని అసైన్మెంట్ పట్టాల కోసం ఎంపిక చేశామన్నారు. శ్మశాన వాటికల నిర్మాణ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్వీన్, ఆర్డీవోలు సుజన, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాతో పలు ప్రయోజనాలు

పూతలపట్టు: రైతులు పశువులు, జీవాలకు బీమా చేయించాలని జిల్లా పశుసంవర్ధ శాఖ జేడీ ప్రభాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో పూతలపట్టు, పెనుమూరు మండలాల పశు వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీమా ప్రీమియంలో కూడా ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందని తెలిపారు. బీమా చేయిస్తే వరదలు, తుపాను, పిడుగు పాటుకు పశువులు, జీవాలు మరణించినా, పాముకాటు, అడవి జంతువుల దాడి, అగ్నిప్రమాదం, రోడ్డు, రైలు ప్రమాదం, అనారోగ్యంతో చనిపోయినా బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం రైతు భరోసా కేంద్రంలో పశువైద్య సహాయకుడి సంప్రదించాలని ఆయన వివరించారు. ఏడీలు చంద్రశేఖర్,గీతారెడ్డి, పశువైద్యులు శివనాగరాజు, దీపాని తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

చిత్తూరు అర్బన్: గుడిపాల మండలంలోని 197–రామాపురం వద్ద గురువారం సారా విక్రయిస్తున్న సురేష్ (37) అనే వ్యక్తిని చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. 197–రామాపురం వద్ద సీఐ మాధవస్వామి, ఎస్ఐ మస్తాన్‌వలి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఇగే గ్రామానికి చెందిన సురేష్ వద్ద ఉన్న 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడ్ని అరెస్టు చేశారు. అలాగే రామాపురం అటవీప్రాంతంలో సారా తయారీ కోసం దాచి ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

అంతర్రాష్ట్ర రహదారికి మహర్దశ

జోడి చింతల నుంచి తమిళనాడు సరిహద్దు వరకు 11 కిలోమీటర్ల రహదారికి చంద్ర గ్రహణం వీడనుంది. త్వరలోనే రహదారికి మహర్దశ పట్టనుంది. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి చొరవతో రహదారి నిర్మాణానికి రూ.25 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే నిధులు మంజూరు కానున్నట్లు సమాచారం.



అధ్వానంగా అంతర్ రాష్ట్ర రహదారి

- నాడు ఎన్‌డీబీ స్కీమ్‌లో చేర్చి వదిలేసిన టీడీపీ ప్రభుత్వం
- నిధులు మంజూరుకాక దుస్థితికి చేరిన రహదారి
- సీఎం, మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, జెడ్పీ వైస్ చైర్మన్
- స్కీమ్‌ను రద్దు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రూ.25 కోట్లతో రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు

యాదమరి : చిత్తూరు నుంచి యాదమరి మీదుగా గుడియాత్తం వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారి నిర్మాణంతో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి త్వరలో ప్రభుత్వం నిధులు విడుదల చేయనుంది. రోడ్డు దుస్థితి, వాహనదారుల అవస్థలను పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పంచా యతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపాదనలు సిద్ధం చేస్తే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈమేరకు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

టీడీపీ పాపం..ప్రజలకు శాపం

చిత్తూరు నుంచి యాదమరి మీదుగా గుడియాత్తం వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారికి గత టీడీపీ ప్రభుత్వంలో చంద్ర గ్రహణం పట్టుకోవడంతో పనులు జరగలేదు. దీంతో రహదారి గుంతలమయంగా మారింది. టీడీపీ ప్రభుత్వ హయంలో 2018లో అంతర్ రాష్ట్ర రహదారి వెడల్పులో భాగంగా ఎన్‌డీబీ(న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్)స్కీమ్‌లో నిధులు మంజూరు చేయాలని ఆపార్టీ నాయకుల వినతులు సమర్పించారు. ఆ మేరకు ఆర్అండ్‌బీ అధికారులు ఆ స్కీంలోకి ఈ రహదారిని చేర్చారు. మళ్లీ నిధులు మంజూరు చేయకుండా అలాగే వదిలేశారు. అనంతరం టీడీపీ ప్రభుత్వం పతనమైంది. ఆ స్కీంలో నిధులు మంజూరు కాక పోవడంతో రహదారి పనులు జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మిగిలిన రహదారులు వేసినా ఎన్‌డీబీ స్కీమ్‌లో ఉండడంతో అంతర్‌రాష్ట్ర రహదారి నిర్మాణానికి నిధులు విడుదల కాలేదు. ప్రజల ఇబ్బందులను గుర్తించి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి ఆ స్కీమ్‌ను రద్దు చేయించారు.

నివేదికలు పంపాం

జోడి చింతల నుంచి తమిళనాడు సరిహద్దు వరకు రహదారి నిర్మాణానికి రూ.25 కోట్లతో ప్రభుత్వానికి నివేదికలు పంపాం. దీనిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. నిధులు మంజూరు కాగానే టెండర్ల ద్వారా రోడ్డు పనులు ప్రారంభిస్తాం. రహదారి పూర్తిగా గుంతల మయంగా ఉంది. ఎస్ఎంబీ స్కీమ్‌లో ఉండడంతోనే గతంలో నిధులు మంజూరు కాలేదు.

–స్టాలిన్ జోన్, ఆర్అండ్‌బీ ఈఈ

వైఎస్సార్ సంపూర్ణ పోషణలో స్వల్ప మార్పులు



నాగశైలజ, ఐసీడీఎస్ పీడీ

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో స్వల్ప మార్పులు చేశారని జిల్లా ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. గురు వారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు వేడి అన్నానికి బదులుగా జూలై 1 నుంచి ప్రతి నెలా ఇంటికి వైఎస్సార్‌ఎస్‌పీ కిట్‌తో పాటు టేక్ హోమ్ రేషన్ అందజేస్తారని పేర్కొన్నారు. ఇందులో 3 కేజీల బియ్యం, కేజీ పప్పు, 1/2 లీటర్ ఆయిల్, 25 కోడిగుడ్లు, 5లీటర్ల పాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

– ప్రతి నెల మొదటి విడతలో (1వ తేదీ నుంచి 15 వరకు) బియ్యం 3 కేజీలు, కేజీ పప్పు, 1/2 లీటర్ ఆయిల్‌తో పాటు వైఎస్సార్ కిట్‌లో జొన్నపిండికి బదులుగా రాగిపిండి 2 కేజీలు, అటుకులు కేజీ, బెల్లం 250 గ్రాములు, వేరుశెనగ చిక్కీలు 250 గ్రాములు, ఎండు ఖర్జూరాలు 250 గ్రాములు, కోడిగుడ్లు 13, పాలు 2.5 లీటర్లు అందజేస్తారన్నారు.

– రెండవ విడతలో (16వ తేదీ నుంచి నెలా ఖరు వరకు) కోడిగుడ్లు 12, పాలు 2.5 లీటర్లు అందజేస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకుని టీహెచ్‌ఆర్ తీసుకున్న గర్భిణులు, బాలింతలు మాత్రమే వీటిని వినియోగించుకోవాలన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు : యువకుడి మృతి

చంద్రగిరి(తిరుపతి రూరల్): హెరిటేజ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా కారు నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమయ్యాడు. పోలీసుల కథనం మేరకు, పనపాకం పంచాయతీ తూర్పుపల్లెకు చెందిన టి.లోకేష్ (35)మస్కట్‌లో ఓ టైల్స్ ఫ్యాక్టరీలో పని చేస్తూ మూడు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం ఉదయం తూర్పుపల్లె నుంచి ద్విచక్ర వాహనంపై చంద్రగిరికి బయలుదేరాడు. ముంగిలిపట్టు వద్ద హెరిటేజ్ కంపెనీలో హెచ్ఆర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఆనందనాయుడు కారులో వస్తూ అతివేగంతో లోకేష్ స్కూటర్‌ను ఢీకొట్టాడు. దీంతో లోకేష్ తీవ్ర రక్త స్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

వాకాడు(చిట్టమూరు): విద్యుత్ షాక్‌తో ఒకరు మృతిచెందిన ఘటన గురువారం మండలంలోని కమ్మరిపాళెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన గడ్డం బాబయ్య(58) రైతు కూలీ. తన ఇంట్లో మరమ్మతులు చేస్తున్నాడు. పెరటి చెట్టుకు తగిలించిన దోటీని తీస్తున్న క్రమంలో ఇంటి పైభాగంలో వెళ్తున్న విద్యుత్ వైర్లకు తగలడంతో బాబయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు కౌన్సెలింగ్‌కు హాజరుకండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని డీఎస్సీ–2008, 1998 టీచర్లు కౌన్సెలింగ్‌కు శుక్రవారం తప్పనిసరిగా హాజరుకావాలని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు చిత్తూరు డీఈవో కార్యాలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ నెల 23వ తేదీ డీఎస్సీ 2008, 1998 టీచర్లు సంబంధిత జాబితాలో ఒకటో నెంబర్ నుంచి 150 వరకు, మిగిలిన వారు ఈ నెల 24న 151 నుంచి ఆ తదుపరి టీచర్లు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. మొత్తం 2008 డీఎస్సీకి చెందిన 187 మందికి, 1998 డీఎస్సీకి చెందిన 548 మందికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు డీఈవో వెల్లడించారు.

ముందుకు సాగని లైంగిక ఆరోపణల కేసు

- పోలీసులపై ఫిర్యాదు చేసి.. విచారణకు సహకరించని వైనం
- కృష్ణగిరిలో చిత్తూరు పోలీసుల ఇబ్బందులు

చిత్తూరు అర్బన్: పోలీసులపై లైంగిక ఆరోపణల ఫిర్యాదు చేసి, ఆపై సహకరించ పోతుండడంతో చిత్తూరు పోలీసులకు తలనొప్పులు తప్పడంలేదు. పూతలపట్టు చోరీ కేసులో తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన పలువురు నిందితులు అరెస్టు కావడం, కొందరు స్టేషన్ బెయిల్‌పై బయటకు రావడం తెలిసిందే. చిత్తూరు పోలీసులపై లైంగిక ఆరోపణలు చేసిన మహిళలు రెండు రోజులుగా దర్యాప్తు అధికారులకు సహకరించడం లేదు. ఎస్ఐతో సహా ఆరుగురిపై ఆరోపణలు చేస్తూ కేసు పెట్టిన మహిళ నుంచి ఏం జరిగిందో తెలుసుకునేందుకు చిత్తూరు ఏఎస్పీ సుధాకర్, టూటౌన్ సీఐ మద్దయ్య బుధ,గురువారాల్లో తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి వెళ్లారు. కృష్ణగిరి ఆస్పత్రి నుంచి నాలుగు రోజుల కిందట డిశ్చార్జ్ అయినా ఇప్పటి వరకు చిత్తూరు పోలీసుల ముందు మహిళలు హాజరు కాలేదు. ఫలితంగా మహిళ ఇచ్చిన లైంగిక ఆరోపణల కేసు ముందుకు వెళ్లడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే దర్యాప్తు సహకరించకపోవడంపై న్యాయపరమైన సలహాలు తీసుకుని కేసు మూసి వేసేందుకు చిత్తూరు పోలీసులు ఆలోచిస్తున్నారు. ఇవి కేవలం పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు వైరముత్తును చోరీ కేసు నుంచి తప్పించేందుకు చేస్తున్న ఆరోపణలుగా పోలీసు అధికారులు భావిస్తున్నారు.

తప్పుడు కథనాలు రాస్తే చర్యలు..

ఈ ఘటనలో కొన్ని పత్రికలు (సాక్షి కాదు) ఇష్టానుసారం వ్యవహరిస్తూ దర్యాప్తును ప్రభావితం చేసేలా వార్తలు ప్రచురించడంపై చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులే ఫిర్యాదు చేస్తే ఒక్క క్షణం ఆలోచించకుండా పోలీసులపై కేసు నమోదుచేసి, ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను బదిలీ కూడా చేశామన్నారు. అలాంటిది రూ.కోటికి బేరసారం చేస్తున్నారంటూ, కృష్ణగిరి వాసులకు డబ్బులు ఇచ్చి కేసు రాజీ చేసుకునేలా పోలీసులు ఒప్పందం కుదుర్చుకున్నారంటూ కొన్ని పత్రికల్లో తప్పుడు రాతలు రావడంపై మండిపడ్డారు. ఇలాంటి అతస్య వార్తలు దర్యాప్తుపై ప్రభావితం చూపుతాయని, కేసు పక్కదారి పడుతుందన్నారు. సంయమనం పాటించకుండా తప్పుడు కథనాలు రాసేవారిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని ఎస్పీ హెచ్చరించారు.

సబ్‌స్టేషన్లను పరిశీలించిన ఎస్ఈ



రెడ్డిగుంట సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని రెడ్డిగుంట, గుడిపాలలోని కొత్తపల్లె సబ్‌స్టేషన్లను ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో ముందస్తుగా సబ్‌స్టేషన్ల సరఫరా పరంగా ఏఈలను ఆరా తీశారు. రెడ్డిగుంట పరిధిలో విజయడెయిరీ, పీవీకేఎన్ డిగ్రీ కళాశాల, కొత్తపల్లె సెక్షన్ నుంచి సీఎంసీ ఆస్పత్రి వరకు సరఫరా ఉందన్నారు. పర్యటన రోజు లైన్ ట్రిప్పు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనుకోకుండ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ట్రీ కటింగ్ చేయాలని, లో ఓల్టేజీ సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి, ఏఈ విశ్వప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.